
సాక్షి భద్రాద్రి కొత్తగూడెం

బుధవారం : 29 : మార్చి : 2023

గరిష్టం / కనిష్టం 37°/ 23°

వాతావరణం

జిల్లాలో బుధవారం మధ్యాహ్నం ఎండ తీవ్రత ఉంటుంది. రాత్రివేళ ఉక్కపోతగా ఉండవచ్చు



వైభవంగా ధ్వజారోహణం

- భక్తులకు గరుడ ప్రసాదం పంపిణీ
- నేడు ఎదుర్కోలు ఉత్సవం
- రేపు శ్రీ సీతారాముల కల్యాణం

భద్రాచలం: భద్రగిరి క్షేత్రంలో మంగళవారం ధ్వజారోహణం వేడుకను శాస్త్రోక్తంగా నిర్వహించారు. భద్రాచలం శ్రీసీతారామ చంద్ర స్వామి వారి దేవస్థానంలో బ్రహ్మోత్సవాలు కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా శ్రీ మహా విష్ణువు ప్రీతిపాత్రుడైన గరుత్మంతుని పటాన్ని ధ్వజస్తంభంపై ఎగురవేశారు. ఉదయం యాగశాలలో తిరువారాధన సేవా కాలం, నివేదన, మంగళ శాసనం, తీర్థప్రసాద వినియోగం జరిగింది. అనంతరం ఎటువంటి విఘ్నాలు కలుగకుండా సేనాధిపతి, విఘ్ననాశకుడు అయిన విశ్వక్సేనార్చన జరిపి, కర్మణ, పుణ్యావాచన, మూర్తి కుంభావాహన, భద్రక మండల ఆరాధన ద్వార తోరణ ఆరాధన జరిపి నవాహ్నిక దీక్షకు అగ్ని ప్రతిష్ఠాపన జరిపారు.


భక్తులకు గరుడ ముద్దలు అందిస్తున్న అర్చకులు

గరుడ ప్రసాదం పంపిణీ

సంతానం లేని వారికి గరుడ ముద్దలను ప్రసాదంగా అందచేశారు. గరుడ ముద్ద తీసుకున్న వారికి సంతానం కలుగుతుందని భక్తులు విశ్వసిస్తారు. ఈ నేపథ్యంలో పలువురు భక్తులు గరుడ ప్రసా దం ప్రసాదం స్వీకరించారు. సాయంత్రం యాగశాలలో బేరీ పూజ నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో ఆలయ ఈఓ ఎల్.రమాదేవి, ఏఈఓలు శ్రవణ్ కుమార్, భవాని రామకృష్ణ, ఆలయ ప్రధాన అర్చకులు పొడిచేటి సీతారామానుజాచార్యులు, విజయ రాఘవన్, స్థానాచార్యులు కేఈ స్థలశాయి, వేదపండితులు గుదిమెళ్ల మురళీకృష్ణమాచార్యులు, అర్చకులు, వేద పండితులు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు ఎదుర్కోలు ఉత్సవం

బ్రహ్మోత్సవాలలో భాగంగా బుధవారం సాయంత్రం ఎదుర్కోలు ఉత్సవం జరగనుంది. కల్యాణం ముందు రోజు స్వామి వారికి జరిగే 'ఎదుర్కోలు ఉత్సవం' ప్రత్యేకం. సీతమ్మ తల్లి, రామయ్య తండ్రికి పెండ్లి సందర్భంగా వారివారి వంశాల గొప్పతనాన్ని గురించి చెప్పుకునే ఈవేడుక భక్తులకు కనువిందుగా ఉంటుంది. హిందూ, ముస్లింల సామరస్యాన్ని పెంపొందించే విధంగా భక్తులందరికీ పన్నీరు చల్లడం ఈ ఉత్సవాల్లో ప్రత్యేకత. గోల్కొండ నవాబైన తానీషాను స్మరింపజేస్తూ భద్రాద్రి ఆలయంలో ఈ సంప్రదాయాన్ని ఇప్పటికీ జరపటం విశేషం. ఇక గురువారం శ్రీ సీతారాముల కల్యాణ మహోత్సవం, 31న పుష్కర పట్టాభిషేకం వేడుకలు మిథిలా స్టేడియంలో జరగనున్నాయి.

తొలుత ప్రధాన ఆలయం నుంచి వేద పండితుల మంత్రోచ్చరణ మధ్య, మంగళ వాయిద్య ఘోషతో సమస్త రాజ లాంఛనాలతో తిరు కల్యాణ ఉత్సవ మూర్తులైన శ్రీసీతారామ లక్ష్మణ స్వామివారిని ప్రధానాలయం చుట్టూ ప్రదక్షిణం చేస్తూ ధ్వజస్తంభం వద్దకు తోడ్కొని వచ్చారు. అనంతరం యాగశాల నుంచి గరుడ పటాన్ని ఆలయం చుట్టూ ప్రదక్షిణలతో అర్చక పరిచారక వేద పండితులు తీసుకొని రాగా బ్రహ్మోత్సవ రక్షణ నిమిత్తం గరుడాళ్వారులను ఆహ్వానించి ఆరాధన చేశారు. గరుడ మహా సంకల్పం, గరుడ గద్యనం, గరుడ మంగళాష్టకములను తర్వానందంగా ప్రధానార్చకులు చదవగా గరుడ పటాన్ని మంగళ వాయిద్య ఘోష నడుమ ధ్వజారోహణం చేశారు. అనంతరం బలిహరణం జరిగింది.




ధ్వజస్తంభం వద్ద పూజలు చేస్తున్న అర్చకులు (ఇన్‌సెట్) ధ్వజస్తంభంపై గరుత్మంతుని చిత్రం

న్యూస్‌రీల్

విధుల్లో జాగ్రత్తగా ఉండాలి

- కలెక్టర్ అనుదీప్


అధికారులకు సూచనలు చేస్తున్న కలెక్టర్

భద్రాచలం: శ్రీరామనవమి, పట్టాభిషేకం ఉత్సవాల విధుల్లో పాల్గొనే అధికారులు, సిబ్బంది జాగ్రత్తగా ఉండాలని కలెక్టర్ అనుదీప్ సూచించారు. మంగళవారం ఆయన భద్రాచలంలో జరుగుతున్న నవమి ఏర్పాట్ల పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భక్తులకు, వీఐపీలకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలన్నారు. కల్యాణ వేడుకలను ప్రశాంతంగా వీక్షించేలా అధికారులు చొరవ చూపాలని తెలిపారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని చెప్పారు. స్వచ్ఛ శ్రీరామనవమి వేడుకల నిర్వహణకు అందరూ సహకరించాలని కోరారు. దేవాదాయ శాఖ కమిషనర్ అనిల్ కుమార్, ఎస్పీ డాక్టర్ వినీత్, దేవస్థానం ఈఓ రమాదేవి, అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, ఆర్డీఓ రమాదేవి, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పెద్దమ్మతల్లికి లక్ష కుసుమార్చన


పూజలు చేస్తున్న అర్చకులు

పాల్వంచరూరల్: శ్రీకనకదుర్గ (పెద్దమ్మతల్లి) ఆలయంలో శ్రీదేవి వసంత నవరాత్రి ఉత్సావాలను పురస్కరించుకుని 7వ రోజు మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు, రుత్వికులు శ్రీ ఆంజనేయస్వామికి పంచామృతాభిషేకం, అమ్మవారికి మల్లెపూలతో లక్షకుసుమార్చన, మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, నాదనీరాజనం, నివేదన, హారతి తదితర పూజలు జరిపారు. ఆలయ కమిటీ చైర్మన్ మహిపతి రామలింగం, పలువురు డైరెక్టర్లు పాల్గొన్నారు.

గిరిపోషణ పథకం అమలుపై పరిశీలన

అశ్వారావుపేటరూరల్: అంగన్‌వాడీ కేంద్రాల్లో గిరిపోషణ పథకం అమలు తీరును మంగళవారం ఇక్రిశాట్ శాస్త్రవేత్త రాజశేఖర్ పరిశీలించారు. మండల పరిధిలోని రెడ్డిగూడెం, తిరుమలకుంట అంగన్‌వాడీ కేంద్రాల్లో ఐటీడీఏ ఆధ్వర్యంలో ప్రత్యేకంగా అమలు చేస్తున్న గిరిపోషణ కార్యక్రమాన్ని ఆయన పరిశీలించి, ఆయా కేంద్రాల్లో ఉన్న చిన్నారుల బరువు, ఎత్తు కొలతలను సేకరించారు. పోషకాహారాన్ని తనిఖీ చేసి సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో సీడీపీఓ రోజారాణి, అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు ఉన్నారు.

రామయ్య పెళ్లికి రైళ్లేవి



భద్రాచలంలో రేపు శ్రీ సీతారాముల కల్యాణం, 31న పట్టాభిషేకం

- ఇప్పటికే బస్సులు, రైళ్లలో బెర్తులన్నీ ఫుల్
- ఏపీ నుంచి భారీగా భద్రాద్రికి రానున్న భక్తులు
- ప్రత్యేక రైళ్లు నడిపించాలని వినతుల వెల్లువ

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: దక్షిణ అయోధ్యగా పేరుగాంచిన భద్రాచలంలో శ్రీ సీతారాముల కల్యాణ వేడుకను ప్రత్యక్షంగా చూసేందుకు రెండు రాష్ట్రాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో వస్తుంటారు. ఈసారి సుమారు లక్ష మంది భక్తులు వస్తారనే అంచనాతో ఆలయ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. పైగా ఈ ఏడాది శ్రీరామనవమి మరుసటి రోజు స్వామివారికి పుష్కర సామ్రాజ్య పట్టాభిషేక మహోత్సవం జరగనుంది. దీంతో భక్తులు మరింత ఎక్కువగా వచ్చే అవకాశం ఉంది. ఇంత భారీ స్థాయిలో భక్తులు వచ్చే పర్వదినాన్ని పురస్కరించుకుని ప్రత్యేక రైళ్లు ఏర్పాటు చేయడంపై రైల్వేశాఖ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది.

ఇప్పటికే సీట్లన్నీ ఫుల్..

భద్రాచలం సీతారామచంద్ర స్వామి వారి కల్యాణ వేడుక తిలకించేందుకు ఏపీలోని ఉమ్మడి గుంటూరు, కృష్ణా, ఉభయ గోదావరి జిల్లాల నుంచి వేల సంఖ్యలో భక్తులు వస్తుంటారు. అలాగే హైదరాబాద్ నుంచి కూడా భారీ స్థాయిలో భక్తులు హాజరవుతారు. భద్రాచలం చేరుకునేందుకు దగ్గరగా భద్రాచలంరోడ్డు (కొత్తగూడెం) రైల్వేస్టేషన్ ఉంది. ఇక్కడి నుంచి నిత్యం హైదరాబాద్, విజయవాడ, సిర్పూర్ కాగజ్‌నగర్‌కు రైళ్లు నడుస్తున్నాయి. ప్రస్తుతం సికింద్రాబాద్ స్టేషన్ నుంచి నిత్యం రెండు రైళ్లు భద్రాచలంరోడ్డు స్టేషన్‌కు నడుస్తున్నాయి. ఈ రెండు రైళ్లలో ఈనెల 28, 28, 29 తేదీలకు సంబంధించి స్లీపర్ క్లాస్ మొదలు, ఏసీ త్రీటైర్, టూ టైర్‌లో టికెట్లు పూర్తిగా అమ్ముడుపోయాయి. కనీసం వెయింటింగ్ లిస్ట్ కూడా చూపించడం లేదు. ఇక విజయవాడ, బల్లార్షా నుంచి రెండు ప్యాసింజర్ రైళ్లు నిత్యం రాకపోకలు సాగిస్తున్నాయి. అయితే, ఈ రైళ్ల రాకపోకల సమయాలు కల్యాణానికి వచ్చే భక్తులకు అనుగుణంగా లేవు.

ప్రత్యేక రైళ్లు నడిపించాలి..

శ్రీరామనవమి రద్దీకి అనుగుణంగా సికింద్రాబాద్, రాజమండ్రి, విజయవాడ, గుంటూరు, రామగుండం వంటి నగరాల నుంచి భద్రాచలం రోడ్డు(కొత్తగూడెం) స్టేషన్‌కు ప్రత్యేక రైళ్లు నడిపించాలని భక్తులు కోరుతున్నారు. ఈనెల 29, 30, 31 తేదీల్లో ఈ రైళ్లు నడిపిస్తే భక్తులకు ఉపయుక్తంగా ఉండడంతో పాటు రైల్వే శాఖకూ ఆదాయం పెరిగే అవకాశం ఉంటుంది. దీనికి తోడు ప్రస్తుతం నడుస్తున్న రైళ్లకు అదనపు బోగీలు జత చేయాలని కోరుతున్నారు.

ప్రైవేట్‌లో దోపిడీ..

రాజమండ్రి, ఏలూరు వంటి గోదావరి జిల్లాల నుంచి రైలు మార్గంలో వచ్చేందుకు భక్తులకు అవకాశమే లేదు. ఇరు రాష్ట్రాలకు చెందిన ఆర్టీసీ సంస్థలు భద్రాచలానికి వందల సంఖ్యలో సర్వీసులు నడిపిస్తున్నా.. ఆ బస్సుల్లో ఈ నెల 29, 30 తేదీలకు సంబంధించి సీట్లన్నీ ఇప్పటికే రిజర్వ్ అయ్యాయి. దీంతో ప్రైవేట్ బస్సులే దిక్కుగా మారాయి. అయితే శ్రీరామనవమికి వచ్చే భక్తుల సంఖ్య పెరిగిపోవడంతో ప్రైవేట్ బస్సులు, ఇతర వాహనాల వారు ఇష్టారీతిగా టికెట్ ధరలు నిర్ణయిస్తున్నారు. సాధారణ రోజుల్లో ప్రైవేట్ ఆపరేటర్లు భద్రాచలం నుంచి హైదరాబాద్‌కు రూ.700 వరకు తీసుకుంటుండగా ఇప్పుడు రూ.1200 వరకు చార్జ్ చేస్తున్నారు. ఏపీలోని పలు పట్టణాలకు సైతం ఇదే తీరున టికెట్ ధరలు పెంచేశారు. కుటుంబ సమేతంగా కల్యాణానికి వచ్చే భక్తులకు పెరిగిన ధరలను భారంగా మారాయి.

ఈసారైనా..

నవమికి ముఖ్యమంత్రి కేసీఆర్ వచ్చేనా..?

- రామయ్య పెళ్లికి ఏడేళ్లుగా సీఎం గైర్హాజరు
- ఇప్పటికే గవర్నర్ తమిళిసై పర్యటన ఖరారు

భద్రాచలం: ముఖ్యమంత్రి హోదాలో శ్రీ సీతారాముల కల్యాణ మహోత్సవానికి పట్టువస్త్రాలు, తలంబ్రాలు సమర్పించక ఏడేళ్లు గడుస్తున్నాయి. తానీషా ప్రభువు కాలం నాటి నుంచి ఈ సంప్రదాయం కొనసాగుతుండగా, ప్రభుత్వం తరపున భద్రాచలం రామయ్యకు పట్టువస్త్రాలు, తలంబ్రాలను సీఎం కేసీఆర్ ఈసారైనా సమర్పిస్తారా లేదా అనే విషయంలో ఇంకా స్పష్టత లేదు. కాగా కల్యాణం మరుసటి రోజు నిర్వహించే పుష్కర పట్టాభిషేక మహోత్సవానికి రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ పర్యటన ఇప్పటికే ఖరారైంది. హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ సైతం వేడుకలకు వస్తున్నట్లు తెలుస్తోంది.

కేసీఆర్ పర్యటనపై సస్పెన్స్..

సీఎం కేసీఆర్ ఈ ఏడాది ఇప్పటికే జిల్లాకు రెండు సార్లు వచ్చారు. గోదావరి వరద ముంపు బాధితుల పరామర్శకు ఒకసారి, కొద్ది రోజుల క్రితం నవ భారత్ ఏరియాలో నిర్మించిన నూతన కలెక్టరేట్ భవన సముదాయం ప్రారంభానికి మరోసారి వచ్చి వెళ్లారు. నవమి వేడుకలకు కూడా వస్తే జిల్లాకు ముచ్చటగా మూడుమార్లు వచ్చినట్లుగా ఉంటుంది. మరో ఏడాదిలో ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో సీఎం వస్తారని, కల్యాణ వేడుకలకు హాజరవుతారని బీఆర్ఎస్ పార్టీ నేతల భారీగా ఆశలు పెట్టుకున్నారు. భద్రాచలం అభివృద్ధి, నవమికి సీఎం గైర్హాజరుపై ప్రతిపక్షాలు చేస్తున్న విమర్శలకు కేసీఆర్ రాకనే గట్టి సమాధానమని పార్టీ నేతలు భావిస్తున్నారు. ఈ తరుణంలో కేసీఆర్ పర్యటనపై తీవ్ర సస్పెన్స్ నెలకొన్నది.

గవర్నర్ రాక..

భద్రాచలంలో 31న జరిగే పుష్కర పట్టాభిషేక మహోత్సవానికి రాష్ట్ర గవర్నర్ తమిళి సై రాక ఇప్పటికే ఖరారైంది. ఇటీవల రాష్ట్రపతి ద్రౌపది ముర్ము భద్రాచలం పర్యటనకు రాగా, వారితోపాటు గవర్నర్ కూడా వచ్చారు. గోదావరి వరదల సమయంలో వరద బాధితుల పరామర్శకు అశ్వాపురం మండలానికి వచ్చారు. మళ్లీ ఈ ఏడాది మూడోసారి పుష్కర పట్టాభిషేక మహోత్సవంలో పాల్గొననున్నారు. హర్యాన రాష్ట్ర గవర్నర్‌గా ఉన్న బండారు దత్తాత్రేయ సైతం శ్రీ సీతారాముల కల్యాణం, పట్టాభిషేక మహోత్సవాలకు హాజరయ్యే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

నేడు రానున్న దేవాదాయశాఖ మంత్రి..

దేవాదాయ శాఖ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి బుధవారం ఉదయం భద్రాచలం చేరుకోనున్నారు. రంగనాయకుల గుట్టపై దాతల సహాయంతో నిర్మించిన సీతానిలయాన్ని ప్రారంభించనున్నారు. దేవాదాయ శాఖ కమిషనర్ అనిల్ కుమార్ మంగళవారం భద్రాచలం చేరుకుని ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. వేడుకలకు చినజీయర్ స్వామి రానున్నట్లు జీయర్ మఠం నిర్వాహకులు ఇప్పటికే ప్రకటించారు. కాగా కలెక్టర్ అనుదీప్, ఎస్పీ డాక్టర్ వినీత్ ఆధ్వర్యంలో సీఎం, గవర్నర్ పర్యటనకు పటిష్ట బందోబస్తు చర్యలు తీసుకుంటున్నారు.

ఏడేళ్లుగాశ్రీరామనవమికి రాని సీఎం


2016లో శ్రీరామనవమి వేడుకలకు హాజరైన ముఖ్యమంత్రి కేసీఆర్ దంపతులు

తహసీల్దార్‌గా ఉన్న కంచర్ల గోపన్న భక్త రామదాసుగా మారి గుడిని నిర్మించటం, ఆ తర్వాత ప్రభుత్వ నిధులను వ్యయం చేసినందుకు తానీషా ప్రభువు ఆయన్ను జైల్లో పెట్టించటం, మళ్లీ విడుదల చేయటం, అనంతరం మతసామరస్యానికి ప్రతీకగా ప్రతి శ్రీరామనవమికి ప్రభుత్వం తరఫున తానీషా ప్రభువు పట్టువస్త్రాలను, తలంబ్రాలను సమర్పించటం ఆనవాయితీగా మారింది. ఈ క్రమంలో తెలంగాణ ఆవిర్భావం తర్వాత 2016లో కేసీఆర్ దంపతులు ప్రభుత్వం తరఫున పట్టువస్త్రాలను, తలంబ్రాలను స్వామివారికి సమర్పించారు. ఈ సందర్భంగా భద్రాచలం అభివృద్ధికి రూ.100 కోట్లను అందచేస్తున్నట్లు ప్రకటించారు. ఆ తర్వాత అది కార్యరూపం దాల్చలేదు. ఇక అప్పటి నుంచి ఇప్పటివరకు భద్రాచలంలో శ్రీరామనవమి ఉత్సవాలకు కేసీఆర్ గైర్హాజరవుతానే ఉన్నారు. 2017లో సీఎం మనుమడు పట్టువస్త్రాలను అందచేయగా, అనంతరం దేవాదాయ శాఖ మంత్రి పట్టువస్త్రాలను అందచేస్తూ వస్తున్నారు.

బీజేపీవి కుట్రలు, కుతంత్రాలు

కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పొదెం వీరయ్య

బూర్గంపాడు: కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీపై బీజేపీ ప్రభుత్వం కుట్రలు, కుతంత్రాలు చేస్తోందని డీసీసీ అధ్యక్షుడు, భద్రాచలం ఎమ్మెల్యే పొదెం వీరయ్య విమర్శించారు. సారపాక ప్రధానకూడలిలో మంగళవారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన సంకల్ప సత్యాగ్రహ దీక్షను ఆయన ప్రారంభించి మాట్లాడారు. వేల కోట్ల రూపాయల ప్రజల సొమ్మును అదానీ ఖాతాల్లోకి మళ్లించిన విషయాన్ని ప్రశ్నిస్తున్నందునే రాహుల్‌గాంధీపై అనర్హత వేటు వేశారని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ, రాహుల్ గాంధీ కుటుంబం ఎన్నో ఆటుపోట్లను ఎదుర్కొని నిలబడ్డ విషయం గుర్తుంచుకోవాలని అన్నారు. రాహుల్ చేపట్టిన భారత్ జోడో యాత్రకు ప్రజల నుంచి విశేష ఆదరణ రావడంతో ప్రధాని మోదీ జీర్ణించుకోలేకపోతున్నారని ఆరోపించారు. ఈ దీక్షల్లో టీపీసీసీ సభ్యుడు తాళ్లూరి చక్రవర్తి, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు బట్టా విజయ్‌గాంధీ, మారం వెంకటేశ్వరరెడ్డి, మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు మహ్మద్‌ఖాన్, మండల అధ్యక్షుడు దుగ్గెంపూడి కృష్ణారెడ్డి, బెల్లంకొండ వాసుదేవరావు, పూలపెల్లి సుధాకర్‌రెడ్డి, చల్లా వెంకటనారాయణ, యారం పిచ్చిరెడ్డి, ఎల్లంకి రాము, మందా నాగరాజు తదితరులు పాల్గొన్నారు.


సంకల్ప సత్యాగ్రహ దీక్షలో పాల్గొన్న డీసీసీ అధ్యక్షుడు పొదెం వీరయ్య, నాయకులు

మూడు రోజులు ట్రాఫిక్ ఆంక్షలు

భద్రాచలంటౌన్: శ్రీరామనవమి వేడుకలను పురస్కరించుకుని ఈ నెల 29 నుంచి 31 వరకు ట్రాఫిక్ ఆంక్షలు విధించినట్లు ఎస్పీ డాక్టర్ వినీత్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. భక్తుల రద్దీ దృష్ట్యా భారీ, గూడ్స్ వాహనాలకు పట్టణంలోకి అనుమతి లేదని పేర్కొన్నారు. అత్యవసరమైతేనే అనమతిస్తామని తెలిపారు. మిథిలా స్టేడియం చుట్టూ ట్రాఫిక్ ఆంక్షలు విధించామని, భక్తులు నిబంధనలు సహకరించాలని కోరారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా క్యూఆర్ కోడ్ ఆన్‌లైన్ లింక్ అందుబాటులో ఉంచామని పేర్కొన్నారు.

భద్రాచలంలో రూట్ మ్యాప్ తెలిపే క్యూఆర్ కోడ్

ఢిల్లీ ర్యాలీకి ఆహ్వానం

హాజరుకానున్న ఇల్లెందు మున్సిపల్‌చైర్మన్


వెంకటేశ్వరరావు

ఇల్లెందు: కేంద్ర ప్రభుత్వం బుధవారం ఢిల్లీలో నిర్వహించ తలపెట్టిన ర్యాలీకి ఇల్లెందు మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావుకు ఆహ్వానం అందింది. కేంద్ర గృహ, పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో 'ఇంటర్నేషనల్ డే ఆఫ్ జీరో వేస్ట్ - ర్యాలీ ఫర్ గార్బేజ్ ఫ్రీ సిటీస్' అనే అంశంపై ర్యాలీ నిర్వహించనున్నారు. ఇందులో పాల్గొనేందుకు తెలంగాణ నుంచి ఇల్లెందు మున్సిపల్ చైర్మన్ తోపాటు పీర్జాదిగూడ మేయర్ జక్క వెంకట్‌రెడ్డిలకు ఆహ్వానం అందింది. ర్యాలీ అనంతరం కేంద్ర మంత్రి హరిదీప్ సింగ్ పూరి ఆహ్వానితులతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించనున్నారు. ఇలాంటి బృహత్తర కార్యక్రమానికి ఆహ్వానం అందటం హర్షణీయమని, పట్టణ కీర్తిపై వీడియో క్లిప్ ప్రదర్శిస్తామని వెంకటేశ్వరరావు తెలిపారు.

పుణ్యస్నానాలకు ఇక్కట్లే..

- భద్రాచలం వద్ద గోదావరిలో తగ్గిపోయిన నీటి మట్టం
- నవమి వేడుకలకు లక్షకు మించి రానున్న భక్తులు
- పుణ్యస్నానాలకు కష్టంగా మారిన పరిస్థితులు
- ఎగువ ప్రాజెక్టుల నుంచి వదిలే అవకాశం ఉన్నా పట్టింపు లేని అధికారులు

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: భద్రాచలంలో సీతారాముల కల్యాణాన్ని కనులారా చూసేందుకు రెండు తెలుగు రాష్ట్రాల నుంచి లక్ష మందికి పైగా భక్తులు భద్రాచలం రానున్నారు. గురువారం జరిగే కల్యాణోత్సవం, శుక్రవారం పట్టాభిషేకానికి భద్రాచలం ముస్తాబవుతోంది. అయితే ఇక్కడ గోదావరి తీరంలో నీరు అడుగంటిన నేపథ్యాన భక్తులు పుణ్యస్నానాలు చేయడం కష్టంగానే కనిపిస్తోంది.

పవిత్రమైన క్రతువు

భద్రగిరి పర్వతంపై లక్ష్మణ సమేతుడైన సీతారాములు కొలువై ఉండగా మిథిలా స్టేడియంలో కల్యాణోత్సవం జరగనుంది. ఈ రెండు ప్రాంగణాలకు అతి సమీపాన సుమారు అర కిలోమీటర్ నిడివితో గోదావరి తీరం వెంట కరకట్టను ఆనుకుని స్నానఘట్టాలు ఉన్నాయి. దూరప్రాంతాల నుంచి భద్రాచలం వచ్చే భక్తులు పావన గోదావరిలో పుణ్యస్నానాలు ఆచరించి రాములవారి దర్శనానికి వెళ్లడం ఆనవాయితీ. మరికొందరు భక్తులు గోదావరి మాతకు పూజలు చేస్తారు. హనుమాన్ భక్తులు సైతం గోదావరిలో మునక వేయనిదే రాముడి దర్శనానికి వెళ్లరు. స్థానికులు తప్పితే దూరప్రాంతాల నుంచి వచ్చే భక్తుల్లో నూటికి తొంభైమంది గోదావరి నీటిని తాకకుండా భద్రాచలం వీడి వెళ్లరు.

నది కాదు నీటి పాయే...

ప్రస్తుతం వేసవి కారణంగా గోదావరిలో నీటి ప్రవాహం తగ్గిపోయింది. వానాకాలంలో అరవై అడుగులను మించి ప్రవహించే గోదావరి ప్రస్తుతం చిన్న నీటి పాయను తలపిస్తోంది. అది కూడా స్నానఘట్టాల నుంచి చాలా దూరంగా చిన్న పాయ వెళ్తోంది. వేసవి మండుటెండలో, భగభగమండే ఇసుకలో నడుస్తూ భక్తులు అక్కడకు వెళ్లాల్సి వస్తోంది. ఒకవేళ వెళ్లి రావాలనుకున్నా కొద్దిసేపు సేద తీరేందుకు ఎలాంటి ఏర్పాట్లు లేవు. దీంతో శ్రీరామనవమికి వచ్చే భక్తుల్లో వృద్ధులు, అనారోగ్య సమస్యలు ఉన్న వారితో పాటు చాలా మంది భక్తులు పుణ్యస్నానాలకు దూరం కావాల్సిన పరిస్థితి నెలకొంది. దీంతో స్నానఘట్టాల నుంచే గోదావరికి దండం పెట్టుకుని నిరాశగా వెనుతిరగాల్సిందే.

నీళ్లు వదిలే అవకాశం ఉన్నా...

వేసవిలో గోదావరిలో నీటి మట్టం పడిపోవడం సర్వసాధారణమే. అయితే ప్రస్తుతం గోదావరి ఎగువన దుమ్ముగూడెం బ్యారేజీ(సీతమ్మసాగర్) మొదలు సమ్మక్కసాగర్, లక్ష్మి బ్యారేజీ(మేడిగడ్డ) వరకు సుమారు 30 టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యం కలిగిన బ్యారేజీలు ఉన్నాయి. ఇందులో నుంచి కొంత మొత్తంలో నీటిని దిగువకు వదిలితే గోదావరిలో భక్తులు సులభంగా పుణ్యస్నానాలు చేసేందుకు అనువైన పరిస్థితులు నెలకొంటాయి. ప్రస్తుతం దుమ్ముగూడెం బ్యారేజీలో ఒక టీఎంసీ, సమ్మక్క సాగర్ బ్యారేజీలో 1.5 టీఎంసీలు, లక్ష్మిబ్యారేజీలో 4 టీఎంసీల నీళ్లు ఉన్నట్లు అధికారిక గణాంకాలు చెబుతున్నాయి. ఇందులో లక్ష్మి బ్యారేజీ వద్ద ఇన్‌ఫ్లో 3,500 క్యూసెక్కులుగా కొనసాగుతోంది. దీనికి ఇంద్రావతి నీటిని సైతం కలుపుకుంటే ఐదువేల క్యూసెక్కులకు పైగానే ప్రవాహం ఉంటుంది. ఇరిగేషన్ అధికారులు సాధ్యాసాధ్యాలను పరిశీలించి నవమికి గోదావరిలో నీళ్లు ఉండేలా చూస్తే బాగుంటుందని భక్తులు కోరుతున్నారు. ఇవన్నీ కాకపోతే గోదావరిలో ప్రస్తుతం పదుల సంఖ్యలో ఇసుక రీచ్‌లు ఉండగా.. ఇసుక రవాణాకు అనుగుణంగా పొక్లెయినర్ వంటి భారీ యంత్రాలతో ట్రెంచ్‌లు కొట్టి నీటి ప్రవాహాన్ని మళ్లిస్తుంటారు. అదే తరహాలో స్నానఘట్టాలకు దూరంగా వెళ్తున్న నీటి పాయను దగ్గరకు తీసుకువచ్చేలా చేసినా భక్తులు తృప్తిగా పుణ్యస్నానాలు ఆచరించి రామయ్యను దర్శించుకునే వీలు కలుగుతుంది. ఇవన్నీ కాకపోతే కనీసం స్నానఘట్టాల వద్ద పైపులైన్లతో షవర్ మాదిరి ఏర్పాట్లు చేసినా భక్తులు గోదావరి జలాలతో పుణ్యస్నానం చేసినట్లుగా తృప్తి పడతారు.


భద్రాచలంలో చిన్న పాయలా ప్రవహిస్తున్న గోదావరి, తేలిన ఇసుక


భద్రాచలంలో స్నానఘట్టాలకు దూరంగా ఉన్న నీరు

క్లుప్తంగా

నేడు భద్రాచలానికి మంత్రి పువ్వాడ

ఖమ్మంమయూరిసెంటర్: రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ బుధవారం భద్రాచలం వెళ్లనున్నారు. సాయంత్రం 7.30 గంటలకు బూర్గంపాడు మండలం సారపాక చేరుకోనున్న ఆయన ఐటీసీ అతిథిగృహంలో బస చేసి, గురువారం భద్రాచలంలో శ్రీసీతారామ స్వామి వారి కల్యాణ మహోత్సవంలో పాల్గొంటారు. ఆతర్వాత మధ్యాహ్నం ఖమ్మం చేరుకుని, ఖమ్మం పర్ణశాల శ్రీసీతారామచంద్రస్వామి వారి శోభాయాత్ర, తెప్పోత్సవంలో మంత్రి పాల్గొననున్నారు.

రూ.11.81 లక్షలకు సంత వేలం


సంత వేలం నిర్వహిస్తున్న అధికారులు

టేకులపల్లి: టేకులపల్లి, గోలియాతండా గ్రామ పంచాయతీల సంయుక్త శ్రీకోదండ రామాలయం సంత వేలం రూ.11,81,000కు ఖరారైంది. గోలియాతండా పంచాయతీ కార్యాలయంలో మంగళవారం వేలం నిర్వహించగా ఏడుగురు సభ్యులు ఒక్కొక్కరు రూ.50 వేల చొప్పున డిపాజిట్ చెల్లించి పాటలో పాల్గొన్నారు. పోటా పోటీగా సాగిన వేలంలో గోలియాతండాకు చెందిన ధారావత్ బాలాజీ నాయక్ సంతను కైవసం చేసుకున్నాడు. గతేడాది పాట కంటే రూ.1000 మాత్రమే పెరిగింది. ఈ కార్యక్రమంలో ఎంపీఓ గణేష్ గాంధీ, ఎస్‌ఐ జి.రమణారెడ్డి, సర్పంచ్‌లు బోడ నిరోషా, బోడ సరిత, కార్యదర్శులు ఎల్.కిరణ్, ప్రశాంత్, ఉప సర్పంచ్ కె.సురేష్, వార్డు సభ్యులు నోముల భానుచందర్, అనంతుల వెంకన్న, ఎండి.హాజీ, ఎండి. మౌలానా పాల్గొన్నారు.


పోషకాహారం తీసుకోవాలి

పోషణ్ అభియాన్ రాష్ట్ర అధికారి రాహుల్


మాట్లాడుతున్న రాష్ట్ర అధికారి రాహుల్

టేకులపల్లి: గర్భిణులు, కిషోర బాలికలు పోషకాహారం తీసుకోవాలని పోషణ్ అభియాన్ రాష్ట్ర అధికారి రాహుల్ సూచించారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో మంగళవారం సులానగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో నిర్వహించిన పోషణ్ పక్వాడ వారోత్సవాల్లో ఆయన మాట్లాడారు. చిరు ధాన్యాలు, ఆకు కూరలు, కూరగాయలు, పండ్లు , తాగునీరు తగినంతగా తీసుకోవాలని చెప్పారు. తొలుత ఆస్పత్రిలో కిషోర బాలికలకు రక్త పరీక్షలు చేయించారు. గర్భిణులకు సీమంతం నిర్వహించారు.జి ల్లా సంక్షేమ అధికారి లెనినా టేకులపల్లి, పాల్వంచ సీడీపీవోలు కె.ఎం.తార, కనకదుర్గ, సొసైటీ చైర్మన్ లక్కినేని సురేందర్, వైస్ ఎంపీపీ ప్రసాద్, ఎంపీటీసీ రామకృష్ణ, సర్పంచ్‌లు బుజ్జి, సురేందర్, రాష్ట్ర టీం సభ్యులు కల్పన, రవి, వైద్యాధికారి దినేష్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సుభాష్‌నగర్ పాఠశాలలో తనిఖీ


మాట్లాడుతున్న వెంకటరెడ్డి

ఇల్లెందురూరల్: మండలంలోని సుభాష్‌నగర్ ప్రాథమిక, ఉన్నత పాఠశాలలను మంగళవారం స్టేట్ అకాడమిక్ టీం తనిఖీ చేసింది. బృందం సభ్యులు ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల ప్రగతిని పరిశీలించారు. విద్యార్థులతో చతుర్విధ ప్రక్రియలపై సాధన చేయించాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఉన్నత పాఠశాలలో పదోతరగతి విద్యార్థులతో కొద్దిసేపు ముచ్చటించారు. అనంతరం ఉపాధ్యాయులతో సమావేశమైన పరీక్షల సమయంలోనూ విద్యార్థులపై పర్యవేక్షణ కొనసాగించాలని చెప్పారు. కార్యక్రమంలో స్టేట్‌టీం ప్రతినిధులు వెంకటరెడ్డి, బాలమురళి, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

బూర్గంపాడు: మోతె గ్రామసమీపంలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన మహిళ చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందింది. పోలీసుల కథనం ప్రకారం.. పినపాక మండలం జానంపేట గ్రామంలోని సుందరయ్యనగర్‌కు చెందిన లేకం లక్ష్మి(29) తన బంధువులైన కొర్సం లక్ష్మయ్య, మడివి రమేష్‌లతో మోటార్‌సైకిల్‌పై సోమవారం భద్రాచలం వెళ్లి తిరిగి వస్తోంది. ఈ క్రమంలో మోతె సమీపంలో కోతి అడ్డురావటంతో లక్ష్మయ్య, లక్ష్మి వస్తున్న బైక్‌కు అదుపు తప్పి కిందపడింది. దీంతో లక్ష్మికి తీవ్రగాయాలయ్యాయి. భద్రాచలం ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.13,781

కూలి పెరిగింది..!


ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీలు (ఫైల్)

ఉపాధి కూలీలకు వేతనం రూ.15 పెంపు

- వచ్చేనెల 1వ తేదీ నుంచి అమలుకు కేంద్రం ఉత్తర్వులు
- ఉమ్మడి జిల్లాలో 5.55 లక్షల మందికి లబ్ధి

ఖమ్మంమయూరిసెంటర్: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న కూలీలకు ఈ వేసవి నుంచి వేతనం పెరగనుంది. ఇందుకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఉత్తర్వుల ప్రకారం ఏప్రిల్ 1వ తేదీ నుంచి పెరిగిన వేతనాలను కూలీలకు అందజేయనున్నారు. ఇప్పటి వరకు ఒక్కో కూలీకి రూ.257 చెల్లిస్తుండగా.. ఇక నుంచి రూ.272 అందుతుంది. ఈ నిర్ణయంతో ఉమ్మడి ఖమ్మం జిల్లాలో 5.55 లక్షల మంది కూలీలకు లబ్ధి చేకూరనుంది. అయితే ఏటా కూలీలకు అందించే వేసవిభత్యంపై మాత్రం ప్రకటన చేయకపోవడం గమనార్హం.

లక్ష్యాలను నిర్దేశిస్తున్న కేంద్రం

ఉపాధి హామీ పథకం నిర్వహణలో కేంద్ర ప్రభుత్వం అనేక మార్పులు తీసుకొచ్చింది. ఇప్పటికే సాఫ్ట్‌వేర్‌ను పూర్తిగా ఆధీనంలోకి తీసుకున్న కేంద్రం పని దినాల లక్ష్యాల కేటాయింపులను కూడా పర్యవేక్షిస్తోంది. కూలీల సంఖ్య ఆధారంగా గ్రామం, బ్లాక్(మండలం), జిల్లాకు పనిదినాల లక్ష్యాలను నిర్దేశిస్తుంది. గతంలో రాష్ట్రప్రభుత్వం కేంద్రం నుంచి వచ్చే పనిదినాల లక్ష్యాన్ని కొంత మేర పెంచుతూ జిల్లాలకు ప్రత్యేక లక్ష్యాలను ఇచ్చేది. కానీ కొత్త సాఫ్ట్‌వేర్ రావడంతో కేంద్రం సూచనలే అమలవుతున్నాయి.

రెండు రాష్ట్రాల్లో..

ఉపాధి పథకంలో అనేక మార్పులు తీసుకొచ్చిన కేంద్రప్రభుత్వం ఏటా మాదిరిగానే 2023–24 ఆర్థిక సంవత్సరానికి కూలీల వేతనాలు పెంచుతూ నిర్ణయం తీసుకుంది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు రూ.15 చొప్పున పెంచగా.. వచ్చే నెల 1వ తేదీ నుంచి అమలవుతుంది. ఈ నిర్ణయం ఆధారంగా ఇప్పటి వరకు రూ.257గా వస్తున్న కూలి రూ.272కు చేరుతుంది. కాగా, గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ పనులు దొరకని సమయాన ఉపాధి హామీ పనులను వినియోగించుకునే కూలీల సంఖ్య ఉమ్మడి జిల్లాలో ఎక్కువగానే ఉంటోంది. ఈ ఏడాది ఉపాధి పనులను ఖమ్మం జిల్లాలో 3.22 లక్షల మంది, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 2.33 లక్షల మంది వినియోగించుకున్నారు.

వచ్చే నెల నుంచి అమల్లోకి...



ఉపాధి హామీ పనులకు వచ్చే కూలీలకు వేతనం పెంచుతూ కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. పెరిగిన వేతనం ఏప్రిల్ 1 నుండి అమల్లోకి రానున్నట్లు ఉత్తర్వులు వెలువడ్డాయి. జాబ్‌కార్డులు కలిగిన కూలీలు ఎండాకాలంలో పనులను సద్వినియోగం చేసుకోవాలి.

– ఎం.విద్యావందన, డీఆర్‌డీఓ, ఖమ్మం

ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఉమ్మడి జిల్లాలో ఉపాధి పనుల వివరాలు..

	ఖమ్మం జిల్లా	భద్రాద్రి కొత్తగూడెం జిల్లా
మొత్తం జాబ్‌కార్డులు	3.04 లక్షలు	2.2 లక్షలు
మొత్తం కూలీలు	6.45 లక్షలు	4.58 లక్షలు
యాక్టివ్ జాబ్‌కార్డులు	1.91 లక్షలు	1.35 లక్షలు
పనులకు వెళ్లే కూలీలు	3.22 లక్షలు	2.33 లక్షలు
ఇప్పటి వరకు ఖర్చు చేసిన నిధులు	రూ.139.42 కోట్లు	రూ.122.41 కోట్లు
వేతనాల కింద అందజేసింది	రూ.83.42 కోట్లు	రూ.81.23 కోట్లు
మెటీరియల్ ఖర్చు	రూ.45.31 కోట్లు	రూ.32.36 కోట్లు



వేసవిభత్యం లేనట్టేనా?

కూలీలకు వేతనాలు పెంచిన ప్రభుత్వం ఈ ఏడాది కూడా వేసవిభత్యం విషయాన్ని మాత్రం వెల్లడించలేదు. ఏటా రాష్ట్ర ప్రభుత్వం కూలీలకు వేసవిభత్యం ప్రత్యేకంగా చెల్లించేది. గతేడాది నుండి కూడా ఇది రద్దయింది. ఈసారైనా వస్తుందని కూలీలు ఆశగా ఎదురు చూస్తుండగా, అటు కేంద్రం, ఇటు రాష్ట్రప్రభుత్వం ఇప్పటి వరకు ప్రకటన చేయలేదు.

భక్తులకు ఇబ్బంది కలగొద్దు

కలెక్టర్ అనుదీప్


గోదావరి ఒడ్డు నుంచి స్నానఘట్టాల ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ అనుదీప్

దుమ్ముగూడెం: ప్రముఖ పుణ్యక్షేత్రమైన పర్ణశాల దేవాలయంలో ఈ నెల 30న జరిగే శ్రీరామనవమికి వచ్చే భక్తులకు ఇబ్బందులు కలుగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అనుదీప్ ఆదేశించారు. మంగళవారం పర్ణశాలలో అధికారులతో నవమి ఏర్పాట్లపై నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు. తొలుత గోదావరి వద్ద స్నానఘట్టాల ఏర్పాట్లను పరిశీలించారు. నదిలో స్నానానికి వెళ్లే భక్తులకు ప్రమాదాలు జరగకుండా అప్రమత్తం చేయాలని, మహిళలకు విశ్రాంతి గదులు ఏర్పాటు చేయాలని చెప్పారు. ఈ నెల 31 గవర్నర్ తమిళిసై పర్ణశాలలో కూడా పర్యటిస్తారని, పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. గవర్నర్ పర్యటన నేపథ్యంలో ఆలయానికి వెళ్లే మార్గంలో రోడ్డు పక్కన ఉన్న షాపులను తొలగించాలని సూచించారు. కల్యాణ మండపం ఏర్పాట్లను పరిశీలించి, క్లాత్ డెకరేషన్ త్వరగా పూర్తిచేయాలని చెప్పారు. మెడికల్ క్యాంపు ఏర్పాటు చేయాలని, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందించాలని, విద్యుత్ పనులు పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీపీఓ రమాకాంత్, ఇరిగేషన్ అధికారులు రాంప్రసాద్, నాగేశ్వరరావు, తహసీల్దార్ చంద్రశేఖర్, ఎంపీడీఓ చంద్రమౌళి, సీఐ రమేష్, ఎంపీఓ ముత్యాలరావు, ఇతర అధికారులు లక్ష్మయ్య, ఆదినారాయణ, రాజు సుహాస్, ఏసుబాబు, రాము, డాక్టర్ రేణుక పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు రూ.51.75 కోట్లు..

- పినపాక నియోజకవర్గంలో ఎస్టీ ఆవాసాలకు బీటీ రోడ్లు
- రూ.100 కోట్ల ప్రతిపాదనలకు ప్రభుత్వ ఆమోదం


ప్రభుత్వ విప్ రేగా కాంతారావు

బూర్గంపాడు: పినపాక నియోజకవర్గానికి ప్రభుత్వం భారీగా నిధులు విడుదల చేసింది. రూ.57.75 కోట్లతో ఎస్టీ ఆవాసాల్లో 34 బీటీ రోడ్లు నిర్మించేందుకు మంగళవారం పరిపాలన అనుమతులు మంజూరు చేసింది. రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ నుంచి ఈ నిధులు కేటాయించింది. నియోజకవర్గంలోని పినపాక, కరకగూడెం, గుండాల, ఆళ్లపల్లి, మణుగూరు, అశ్వాపురం, బూర్గంపాడు మండలాల్లో రూ.100 కోట్లతో చేపట్టనున్న 447 అభివృద్ధి పనులకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. రాష్ట్ర ప్రభుత్వం స్పెషల్ గ్రాంటు కింద నిధులు కేటాయించనుండగా, పినపాక నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో బీటీ రోడ్లు, కనెక్టవిటీ రోడ్లు, కమ్యూనిటీహాల్స్, బస్టాండ్లు, ట్యాంకుల నిర్మాణం చేపట్టనున్నారు. నిధుల విడుదలకు స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ రేగా కాంతారావు చొరవతీసుకున్నారు. ఈ సందర్భంగా కాంతారావు మాట్లాడుతూ మారుమూల గ్రామాల అభివృద్ధికి ప్రతిపాదనలను సిద్ధం చేయించి ముఖ్యమంత్రి కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లగా నిధులు మంజూరు చేశారని తెలిపారు.

మొక్కల సంరక్షణపై దృష్టి సారించాలి


ప్లాంటేషన్‌ను పరిశీలిస్తున్న జెడ్పీ సీఈఓ విద్యాలత

ఇల్లెందురూరల్: ఎండలు మండుతున్నందున మొక్కలు వడలిపోకుండా సంరక్షణకు అధిక ప్రాధాన్యతనివ్వాలని జెడ్పీ సీఈఓ విద్యాలత పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. మండలంలోని బొజ్జాయిగూడెం, ఇందిరానగర్ గ్రామపంచాయతీల్లో మంగళవారం అవెన్యూ ప్లాంటేషన్, నర్సరీ, క్రీడా ప్రాంగణాలను తనిఖీ చేసి మాట్లాడారు. రహదారుల వెంట ఉన్న మొక్కలకు విధిగా ట్రీగార్డులు ఏర్పాటు చేయాలని, క్రమం తప్పకుండా నీటిని అందించాలని సూచించారు. ఎండ ప్రభావం పడకుండా నర్సరీలపై షేడ్‌నెట్‌లను విధిగా అమర్చాలని చెప్పారు. ఎంపీడీఓ అప్పారావు, షర్మిల, నాగమణి పాల్గొన్నారు.

కొబ్బరి సాగు పెంచేందుకు కృషి

కొబ్బరి అభివృద్ధి మండలి అధికారి కిరణ్ కుమార్


మాట్లాడుతున్న కిరణ్ కుమార్

అశ్వారావుపేటరూరల్: కొబ్బరి తోటల సాగు ద్వారా రైతులకు అధిక లాభాలు వస్తాయని, ఈ ప్రాంతంలో అధికంగా ఉన్న పామాయిల్ పంటతో సమానంగా ఆదాయాన్ని పొందవచ్చని కొబ్బరి అభివృద్ధి మండలి అధికారి కిరణ్ కుమార్ సూచించారు. మండల పరిధిలోని అచ్యుతాపురం గ్రామంలో ఉన్న ఓ రైతు కొబ్బరితోటలో మంగళవారం నిర్వహించిన కొబ్బరి సాగు క్షేత్ర దినోత్సవంలో ఆయన మాట్లాడారు. పామాయిల్ సాగు అందిస్తున్న రాయితీలు, సబ్సిడీలు కొబ్బరి తోటల సాగుకు అందుతాయని వివరించారు. ఇప్పటికే అశ్వారావుపేట, దమ్మపేట మండలాల్లో కొబ్బరి సాగులో ఉందని, మరింత మంది రైతులు సాగు చేసేందుకు ముందుకు రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉద్యాన శాఖ నియోజకవర్గ అధికారి సందీప్, తెలంగాణ కొబ్బరి రైతుల ఉత్పత్తిదారుల సంఘం బాధ్యులు కొక్కరపాటి పుల్లయ్య, నల్లపు శివకుమార్, తాడేపల్లి రవి, సంతపూడి చెన్నారావు, కొనకళ్ల కృష్ణ, పీ ఆదినారాయణ, ఆళ్ల నాగేశ్వరరావు, తుమ్మా రాంబాబు, తలశిల ప్రసాద్ పాల్గొన్నారు.

పక్వానికిరాని గెలలు తీసుకురావొద్దు

అశ్వారావుపేటరూరల్: ఆయిల్‌పాం తోటల్లో పూర్తిగా పక్వానికిరాని గెలలను ఫ్యాక్టరీకి తీసుకురావొద్దని ఆయిల్‌ఫెడ్ డివిజనల్ మేనేజర్ ఆకుల బాలకృష్ణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నందున పచ్చి గెలలు కూడా పక్వానికి వచ్చినట్లు కనిపిస్తాయని, రైతులు గమనించాలని సూచించారు. కౌలు రైతులు తమ ఎఫ్ కోడ్ కార్డులను పునరుద్ధరించుకోవాలని, పాత కార్డులను ఏప్రిల్ 1వ తేదీ నుంచి నిలిపివేస్తామని పేర్కొన్నారు. రైతులంతా ఈ నెల చివరి నాటికి కార్డులను పునరుద్ధరించుకోవాలని కోరారు.

రేషన్ బియ్యం పట్టివేత


రేషన్ బియ్యంతో నిందితుడు శ్రీను

భద్రాచలంటౌన్: అక్రమంగా తరలిస్తున్న 15 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని సివిల్ సప్లయీస్ అధికారులు మంగళవారం పట్టుకున్నారు. టాటా మ్యాజిక్ వాహనంలో అశ్వాపురం నుంచి ఏపీలోని చట్టికి తరలిస్తుండగా భద్రాచలం బ్రిడ్జి సెంటర్‌లో పట్టుకుని బియ్యంతోపాటు వాహనాన్ని సీజ్ చేశారు. నిందితుడు శ్రీనుపై కేసు నమోదు చేసినట్లు భద్రాచలం సివిల్ సప్లయీస్ డీటీ వెంకటేశ్వర్లు తెలిపారు.

పలువురికి పొంగులేటి పరామర్శ


ఆర్థికసాయం అందచేస్తున్న శ్రీనివాసరెడ్డి

చుంచుపల్లి: ఖమ్మం మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి మంగళవారం మండలంలోని పెనగడప, రాంపురం, అంబేడ్కర్ నగర్, వనమా నగర్, ములుగు గూడెం, చంద్రుకుంట, గౌతంపూర్, రుద్రంపూర్ ప్రాంతాల్లో పర్యటించారు. ఇటీవల మృతి చెందినవారి కుటుంబాలను పరామర్శించారు. అనారోగ్యంతో బాధపడుతున్న వారిని కలిసి ఆర్థికసాయం అందించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఊకంటి గోపాలరావు, గోరె బాబు, దుర్గా, నరసింహారావు, సీతయ్య, నాసర్, కృష్ణ, రాజు, హుస్సేన్, విజయ భాస్కర్ రావు, నాగమణి, రాము, ఆదినారాయణ, రాఘు, సతీశ్ తదితరులు పాల్గొన్నారు.

కానిస్టేబుల్ కుటుంబానికి పరిహారం అందజేత

కొత్తగూడెంరూరల్: రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన కానిస్టేబుల్ కుటుంబానికి 6వ బెటాలియన్ కమాండెంట్ డి.శివ ప్రసాద్‌రెడ్డి మంగళవారం రూ.30 లక్షల పరిహారం చెక్కును అందజేశారు. 6వ బెటాలియన్‌కు చెందిన పోలీసుకానిస్టేబుల్ మంచినీళ్ల రమేష్ టేకులపల్లిలో విధులకు వెళ్తూ గతేడాది డిసెంబర్ 18న రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. దీంతో అతని కుటుంబ సభ్యులకు చెక్కు అందించారు. ఎస్‌బీఐ మేనేజర్ మురళీకృష్ణ, అసిస్టెంట్ కమాండెంట్ బి.సీతారాం, టి.కాళీదాస్,ఆర్‌ఐ,ఆర్‌ఎస్‌ఐలతోపాటు బెటాలియన్ సిబ్బంది పాల్గొన్నారు.

'ఎల్‌వీ ప్రసాద్' సిబ్బందికి వైద్య పరీక్షలు

పాల్వంచ: పట్టణంలోని నవభారత్ ఎల్‌వీ ప్రసాద్ ఐ ఇనిస్టిట్యూట్‌లో పనిచేసే వైద్య సిబ్బంది 63 మందికి శేఖరం బంజర అర్బన్ హెల్త్ సెంటర్ ఆధ్వర్యంలో మంగళవారం వైద్య పరీక్షలను నిర్వహించారు. ఆస్పత్రిలో పనిచేసే వైద్య సిబ్బంది హెల్త్ ప్రొఫైల్ ఆరోగ్యశాఖకు అందుబాటులో ఉంటుందని ఈ సందర్భంగా యాజమాన్యం తెలిపింది. కార్యక్రమంలో ఎల్‌వీ ప్రసాద్ ఇనిస్టిట్యూట్ మేనేజర్ వి.విజయకుమార్, డిప్యూటీ డెమో ఎండి.ఫయాజ్ మొయినుద్దీన్, హెల్త్ ఎడ్యుకేటర్ విజయ్‌కుమార్, ఎల్‌టీ రాములమ్మ, శృతి తదితరులు పాల్గొన్నారు.

కారు ఢీకొని ఒకరికి గాయాలు

అన్నపురెడ్డిపల్లి: మండలంలోని బూర్గుడెం గ్రామంలో మంగళవారం జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి గాయపడ్డాడు. స్థానికుల కథనం ప్రకారం... బూర్గుడెం గ్రామానికి చెందిన ఎస్‌డీ అబ్బాస్ పొలం పనులు ముగించుకుని ఎడ్లబండిపై ఇంటికి వెళ్తున్నాడు. అదే సమయంలో కొత్తగూడెం నుంచి వీఎం బంజర్ వైపు వెళ్తున్న కారు వెనుకవైపు నుంచి ఎడ్లబండిని ఢీకొట్టింది. దీంతో అబ్బాస్‌తోపాటు ఒక ఎద్దుకు తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రుడిని 108 వాహనంలో ఆస్పత్రికి తరలించారు. సంఘటనా స్థలాన్ని ఎస్సై షాహీనా పరిశీలించారు.

ఏపీలో చోరీ.. తెలంగాణలో తాకట్టు!

అశ్వారావుపేటరూరల్: ఏపీలో చోరీ చేసిన బంగారు ఆభరణాలను ఓ దొంగ తెలంగాణలోని అశ్వారావుపేటలో తాకట్టు పెట్టిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఏపీలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా నాగారం పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ వ్యక్తి బంగారం ఆభరణాల చోరీకి పాల్పడ్డాడు. అక్కడి పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించగా ఈ విషయం వెల్లడైనట్లు తెలిసింది. అశ్వారావుపేటలోని ఓ ప్రైవేటు ఫైనాన్స్‌లో ఓ స్థానికుడి ఆధార్ కార్డు ప్రూఫ్‌తో తాకట్టు పెట్టి, దాదాపు రూ.8.50 లక్షల వరకు తీసుకున్నట్లు సమాచారం. దీంతో ఏపీ పోలీసులు మంగళవారం అశ్వారావుపేటకు చెందిన ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకుని వెళ్లారు. దీనిపై స్థానిక ఎస్‌ఐ బి.రాజేశ్ కుమార్‌ను వివరణ కోరగా.. ఏపీ పోలీసులు విచారణ వాస్తవమేనని, పూర్తి వివరాలు తెలియాల్సి ఉందని తెలిపారు.

ఫోర్జరీ కేసులో ఒకరి అరెస్ట్

వివరాలు వెల్లడించిన ఏసీపీ బస్వారెడ్డి


వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ బస్వారెడ్డి

ఖమ్మంరూరల్: మండలంలోని ఏదులాపురం గ్రామపంచాయతీ పరిధిలో ఇంటి అనుమతుల కోసం గ్రామకార్యదర్శి నాగరాజు సంతకాన్ని ఫోర్జరీ చేసిన నాయుడుపేటకు చెందిన వై.లక్ష్మారెడ్డిని మంగళవారం పోలీసులు అరెస్టు చేశారు. ఈ సందర్భంగా ఖమ్మం రూరల్ ఏసీపీ బస్వారెడ్డి విలేకరులతో మాట్లాడుతూ కార్యదర్శి నాగరాజు సంతకాలను ఫోర్జరీ చేయడమే కాకుండా నకిలీ స్టాంప్‌లతో లక్ష్మారెడ్డి ఇంటి అనుమతి పత్రాలను ఇచ్చినట్లు విచారణలో తేలిందని చెప్పారు. ఇదే కేసులో తనగంపాడుకు చెందిన నాగరాజు కూడా ఉండగా ఆయన గాలిస్తున్నట్లు తెలిపారు. కొద్దిరోజుల క్రితం తనగంపాడులో బతికి ఉన్న భార్యాభర్తలు మృతి చెందినట్లు నకిలీ సర్టిఫికెట్లు సృష్టించి భూమిని అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించుకున్న కేసులో ఇంకా ముగ్గురిని అరెస్ట్ చేయాల్సి ఉందని వెల్లడించారు. భూముల ధర పెరగడంతో పలువురు అక్రమ మార్గంలో సొంతం చేసుకోవాలని యత్నిస్తున్నారని, అలాంటి వారిపై కేసులు నమోదు చేసి అవసరమైన పీడీ యాక్ట్ పెడతామని పేర్కొన్నారు. కాగా, కొందరు నకిలీ ధ్రువపత్రాలు, పహాణీలు, పాస్‌బుక్కులు సమర్పించి బ్యాంకుల ద్వారా రుణాలు తీసుకున్నారనే సమాచారంతో విచారణ చేపడుతున్నట్లు ఏసీపీ బస్వారెడ్డి తెలిపారు. ఈ సమావేశంలో సీఐ రాజిరెడ్డి, ఎస్‌ఐ వెంకటకృష్ణ పాల్గొన్నారు.

సాగర్ కాల్వలో యువకుడు గల్లంతు

ఖమ్మంక్రైం: ఈత కొట్టేందుకు వెళ్లిన యువకుడు సాగర్ కాల్వలో గల్లంతయ్యాడు. ఖమ్మం 58వ డివిజన్ దొరన్ననగర్‌కు చెందిన నోసిన రాజు(18) మున్సిపల్ కార్పొరేషన్‌లో చెత్త సేకరణకు ఔట్ సోర్సింగ్ పద్ధతిలో పనిచేస్తున్నాడు. సోదరి శిరీషతో కలిసి ఇంటి సమీపాన ఉన్న సాగర్ కాల్వలో బట్టలు ఉతికేందుకు మంగళవారం వెళ్లాడు. అక్కడ ఈత కొట్టాలని ఆయన నీళ్లల్లో దిగగా నీటి ఉధృతిలో కొట్టుపోయాడు. రాజు సోదరి ఫిర్యాదు మేరకు టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేసి గాలింపు చేపట్టారు.

గాయపడిన వ్యక్తి మృతి

మణుగూరుటౌన్: మండలంలోని తిర్లాపురం గ్రామ సమీపంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన మండకం మూకయ్య(50) చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. కుంట ప్రాంతానికి చెందిన మూకయ్య రోడ్డు ప్రమాదంలో గాయపడగా భద్రాచలం, అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు మణుగూరు సీఐ ముత్యం రమేష్ తెలిపారు.

చెట్టుకు బైక్ ఢీకొని...

పాల్వంచరూరల్: ద్విచక్రవాహనం చెట్టుకు ఢీకొని గాయపడ్డ యువకుడు మృతి చెందాడు. రూరల్ ఎస్‌ఐ శ్రీనివాస్ కథనం ప్రకారం.. బూర్గంపాడు మండలం పోలవరం గ్రామానికి చెందిన ట్రాక్టర్ డ్రైవర్ సోయం వంశీ (19) సోమవారం మండల పరిధిలోని పాండురంగాపురం గ్రామం వైపు ద్విచక్రవాహనంపై వెళ్తున్నాడు. ఈ క్రమంలో బైక్ అదుపు తప్పి రోడ్డు పక్కన ఉన్న చెట్టును ఢీకొట్టాడు. తీవ్ర గాయాలు కావడంతో స్థానికులు ఆటోలో పాల్వంచ ఆస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం కొత్తగూడెం తీసుకెళ్లి వైద్యం చికిత్స అందించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో మంగళవారం హైదరాబాద్ తీసుకెళ్తుండగా మార్గంమధ్యలో మృతి చెందాడు. మృతుడి తల్లి సోయం గణేశ్వరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

పూరి గుడిసె దగ్ధం

పాల్వంచరూరల్: మండల పరిధిలోని దంతెలబోర పంచాయతీ గంగదేవిగుప్ప గ్రామంలో సోమవారం అర్ధరాత్రి ఓ పూరి గుడిసె దగ్ధమైంది. గ్రామానికి చెందిన పాయం సుజాత ఇంట్లో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ ఏర్పడి మంటలు చెలరేగాయి. ఇంటితోపాటు దుస్తులు, బియ్యం, ఇతర సామగ్రి పూర్తిగా కాలిపోయాయి. రూ.40 వేల ఆస్తి నష్టం జరిగింది. ఆర్ఐ హచ్చా సంఘటనా స్థలాన్ని సందర్శించి నష్టం అంచనా వేశారు.

క్లుప్తంగా...

భైంసాలో శోభాయాత్రకు ఓకే

షరతులు పాటించాలన్న హైకోర్టు

సాక్షి, హైదరాబాద్: నిర్మల్ జిల్లా భైంసా పట్టణం, తానూర్‌లో ఈ నెల 30న నిర్వహించే శ్రీ రామ నవమి శోభాయాత్రకు రాష్ట్ర హైకోర్టు షరతులతో కూడిన అనుమతి ఇచ్చింది. ఉదయం 9 నుంచి ఒంటి గంట వరకు యాత్రకు అనుమతి ఇచ్చింది. మతపరంగా, రాజకీయంగా రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయొద్దని, రాజకీయ నాయకులు, నేర చరిత్ర ఉన్నవారు యాత్రలో పాల్గొనరాదని స్పష్టం చేసింది. మసీదులు ఉన్న చోట యాత్ర సాగేటప్పుడు 150 మీటర్లకు ముందే సౌండ్ సిస్టం ఆపేయాలని సూచించింది. భైంసాలో శ్రీరామనవమి శోభాయాత్రకు అనుమతి ఇచ్చేలా పోలీసులను ఆదేశించాలని కోరుతూ హిందూ వాహిని అనే సంస్థ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. తానూర్‌లో శోభాయాత్రకు అనుమతి ఇవ్వాలని కోరుతూ అదే గ్రామానికి చెందిన ఎ.నరేందర్, ఆర్.గంగాప్రసాద్ మరో పిటిషన్ వేశారు. వీటిపై న్యాయమూర్తి జస్టిస్ విజయ్‌సేన్‌రెడ్డి మంగళవారం విచారణ చేపట్టారు. పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది సూర్యకరణ్ రెడ్డి, ప్రభుత్వం తరఫున న్యాయవాది సామల రవీందర్ వాదనలు వినిపించారు. ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయమూర్తి షరతులతో కూడిన అనుమతినిస్తూ ఆదేశాలు జారీ చేశారు.

ప్రాణం తీసిన పొగ

చెత్త తగలబెడుతుండగా ఊపిరాడక రైతు మృతి


మృతుడు బాబు (ఫైల్)

బూర్గంపాడు: జామాయిల్ తోటలో పోగైన చెత్తను తగలబెడుతుండగా పొగతో ఊపిరాడక ఒక రైతు మృతి చెందాడు. ఆలస్యంగా వెలుగుచూసిన ఈ సంఘటన వివరాలివి. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పినపాక పట్టీనగర్ గ్రామానికి చెందిన రైతు కలసాని బాబు (65) సోమవారం ఉదయం పొలం పనులకు వెళ్లాడు. అప్పటికే నరికిన జామాయిల్ తోటలోని చెత్త తగులబెడుతున్న క్రమంలో ఒక్కసారిగా మంటలు, పొగ వ్యాపించాయి. దీంతో బాబు పొగ ధాటికి తట్టుకోలేక ఊపిరాడక కుప్పకూలాడు. ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో గమనించలేదు. సాయంత్రం వరకు ఇంటికి రాకపోవడంతో కుటుంబసభ్యులు జామాయిల్ తోటకు వెళ్లగా బాబు మృతదేహం కనిపించింది. ఆయన ఒంటిపై ఎలాంటి కాలిన గాయాలు లేకపోవడంతో.. పొగ, మంటల తీవ్రతకు ఊపిరాడక అస్వస్థతకు గురై మృతి చెందాడని భావిస్తున్నారు. మృతునికి భార్య నాగమ్మ, కుమారుడు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. ఈ సంఘటనపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

రామోజీ, శైలజకు సీఐడీ నోటీసులు

▶ మొదటి పేజీ తరువాయి

కార్యాలయంలోగానీ విచారణకు హాజరు కావాలని సీఐడీ నోటీసుల్లో పేర్కొంది. చిట్‌ఫండ్ చట్టం నిబంధనలను ఉల్లంఘించి నిధులు మళ్లించడంపై ఏ–1గా రామోజీరావు, ఏ–2గా శైలజతోపాటు మార్గదర్శి చిట్‌ఫండ్స్ మేనేజర్లపై సీఐడీ అధికారులు ఇప్పటికే కేసులు నమోదు చేసిన విషయం తెలిసిందే. మార్గదర్శి చిట్‌ఫండ్స్ కార్యాలయాల్లో సీఐడీ అధికారులు విస్తృతంగా నిర్వహించిన తనిఖీల్లో అక్రమాలు వెలుగులోకి వచ్చాయి. చిట్‌ఫండ్ చట్టానికి విరుద్ధంగా చందాదారుల సొమ్మును మ్యూచువల్ ఫండ్స్, షేర్ మార్కెట్లలో పెట్టుబడులుగా పెట్టడం, ఆర్బీఐ నిబంధనలకు విరుద్ధంగా డిపాజిట్లు సేకరిస్తున్నట్లు ఆధారాలతో సహా వెల్లడైంది. ఈ నేపథ్యంలో ఐపీసీ సెక్షన్లు 420, 409, 120 బి, 477 రెడ్‌విత్ 34, కేంద్ర చిట్‌ఫండ్స్ చట్టం–1982, ఆర్థిక సంస్థల రాష్ట్ర డిపాజిట్‌దారుల హక్కుల పరిరక్షణ చట్టం కింద ఎఫ్‌ఐఆర్ నమోదైంది. ఈ కేసులో సీఐడీ అధికారులు నలుగురు మార్గదర్శి చిట్‌ఫండ్స్ మేనేజర్లను అరెస్టు చేశారు.

• అదో ఆర్థిక నేర సామ్రాజ్యం...

మార్గదర్శి చిట్‌ఫండ్స్‌లో చందాదారుల సొమ్మును చట్ట విరుద్ధంగా మళ్లించడం ద్వారా రామోజీరావు యథేచ్ఛగా ఆర్థిక నేరాలకు పాల్పడ్డారు. కేంద్ర ప్రభుత్వ చిట్‌ఫండ్స్ చట్టం–1982, రిజర్వ్‌బ్యాంకు చట్టం, ఏపీ ఆర్థిక సంస్థల డిపాజిట్‌దారుల హక్కుల పరిరక్షణ చట్టాలను ఉల్లంఘించారు. మార్గదర్శి చిట్‌ఫండ్స్ సంస్థ బ్రాంచి కార్యాలయాల్లో స్టాంపులు–రిజిస్ట్రేషన్ల శాఖ గత ఏడాది అక్టోబర్, నవంబర్ నెలల్లో, హైదరాబాద్‌లోని ప్రధాన కార్యాలయంలో డిసెంబర్‌లో నిర్వహించిన సోదాలతో ఈ అక్రమాల బాగోతం బట్టబయలైంది. సొమ్ములు రాష్ట్రంలోని చందాదారులవి కాగా ఆర్థిక ప్రయోజనాలు మాత్రం పొరుగు రాష్ట్రంలో మకాం వేసిన రామోజీరావువని వెల్లడైంది. రాష్ట్ర చందాదారుల కష్టార్జితానికి రక్షణ లేదని గుర్తించిన స్టాంపులు–రిజిస్ట్రేషన్ల శాఖ దీనిపై సీఐడీకి ఫిర్యాదు చేసింది. ఈ క్రమంలో విశాఖపట్నం, రాజమహేంద్రవరం, ఏలూరు, విజయవాడ, గుంటూరు, నరసరావుపేట, అనంతపురంలోని మార్గదర్శి చిట్ ఫండ్స్ కార్యాలయాల్లో సీఐడీ నిర్వహించిన సోదాల్లో మరిన్ని అక్రమాలు బయటపడ్డాయి. మరోవైపు స్టాంపులు– రిజిస్ట్రేషన్ల శాఖ ప్రత్యేకంగా ఓ చార్టెడ్ అకౌంటెంట్‌ను ద్వారా మార్గదర్శి చిట్‌ఫండ్స్ ఆర్థిక నివేదికలను పరిశీలించగా పలు అక్రమాలు వెలుగులోకి వచ్చాయి. ఎంతోమంది చందాదారులు తాము మోసపోయినట్లు సీఐడీకి ఫిర్యాదులు చేస్తున్నారు. మనీలాండరింగ్‌కు పాల్పడినట్లు తేలడంతో ఈ అంశంపై దర్యాప్తు చేయాలని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ)కు సీఐడీ నివేదించింది.

మార్గదర్శిలో గుర్తించిన అక్రమాలు ఇవీ..

అక్రమ డిపాజిట్లు..

రిజర్వ్ బ్యాంకు నిబంధనలకు విరుద్ధంగా మార్గదర్శి చిట్‌ఫండ్స్ అక్రమ డిపాజిట్లను సేకరిస్తోంది. చందాదారులు పాడిన చిట్ మొత్తాన్ని వారికి వెంటనే చెల్లించడం లేదు. ఆ మొత్తంపై 4 శాతం నుంచి 5 శాతం వరకు చందాదారుడికి వడ్డీ చెల్లిస్తామని చెబుతూ ఓ రశీదు ఇస్తున్నారు. అంటే మార్గదర్శి సంస్థ ఆ చిట్ మొత్తాన్ని డిపాజిట్‌గా స్వీకరిస్తున్నట్టే. చిట్‌ఫండ్ కంపెనీలు డిపాజిట్లు స్వీకరించడాన్ని చట్టం నిషేధించింది. అయినప్పటికీ మార్గదర్శి చిట్ ఫండ్స్ సంస్థ నిబంధనలకు విరుద్ధంగా 'ప్రత్యేక రశీదు' ముసుగులో డిపాజిట్లు సేకరించింది. గతంలో కూడా మార్గదర్శి ఫైనాన్షియర్స్ పేరిట రూ.15 వేల కోట్ల అక్రమ డిపాజిట్లు సేకరించిన చరిత్ర రామోజీరావుది. అదే తరహాలో ప్రస్తుతం మార్గదర్శి చిట్‌ఫండ్స్ ముసుగులో అక్రమ డిపాజిట్లు సేకరిస్తున్నారు.

నిధుల మళ్లింపు.. అక్రమ పెట్టుబడులు

చిట్‌ఫండ్ చట్టానికి విరుద్ధంగా రామోజీరావు చందాదారుల సొమ్మును అక్రమ పెట్టుబడులకు మళ్లించారు. మార్గదర్శి చిట్ ఫండ్స్ కార్యాలయాల నుంచి భారీగా నిధులను మార్గదర్శి ప్రధాన కార్యాలయానికి బదిలీ చేశారు. ఆ నిధులను మార్గదర్శి యాజమాన్యం మార్కెట్ రిస్క్ అత్యధికంగా ఉండే మ్యూచువల్ ఫండ్స్‌లో పెట్టుబడిగా పెట్టింది. మార్గదర్శి చిట్స్ ప్రైవేట్ లిమిటెడ్–చెన్నై, మార్గదర్శి చిట్స్ (కర్ణాటక) ప్రైవేట్ లిమిటెడ్–బెంగళూరు, ఉషాకిరణ్ మీడియా ప్రైవేట్ లిమిటెడ్– హైదరాబాద్‌లను అనుబంధ కంపెనీలుగా చూపిస్తూ నిధులను అక్రమంగా మళ్లించారు. ఆ మూడు అనుబంధ కంపెనీల్లో రూ.1,05,80,000 పెట్టుబడి పెట్టినట్టు బ్యాలెన్స్ షీట్‌లో చూపించారు. అయితే ఆ కంపెనీల షేర్ హోల్డర్స్ జాబితా పరిశీలించగా ఒక్క ఉషా కిరణ్ మీడియా ప్రైవేట్ లిమిటెడ్‌లోనే 88.5 శాతం వాటాతో రూ.2 కోట్లు పెయిడ్ అప్ క్యాపిటల్‌గా పెట్టుబడి పెట్టినట్లు నిర్ధారణ అయ్యింది. బ్యాలన్స్ షీట్‌లో నోట్ నంబర్ 7 కింద రూ.459.98 కోట్లు చూపించారు. అయితే ఆ మొత్తాన్ని నిబంధనలకు విరుద్ధంగా మ్యూచువల్ ఫండ్స్‌లో పెట్టుబడి పెట్టినట్లు పరిశీలనలో వెల్లడైంది. అందుబాటులో ఉన్న కొన్ని బ్యాంకు ఖాతాలను పరిశీలించగా ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ మ్యూచువల్ ఫండ్స్‌లో మూడుసార్లు రూ.29 కోట్లు, రూ.10 కోట్లు, రూ.8 కోట్లు చొప్పున, ఎడెల్‌వైస్ ఆర్బిట్రేడ్ ఫండ్స్‌లో రూ.10 కోట్లు చొప్పున నిబంధనలకు విరుద్ధంగా పెట్టుబడులు పెట్టినట్లు వెల్లడైంది. పూర్తి బ్యాంకు ఖాతాలను పరిశీలిస్తే ఇంకా ఎన్ని పెట్టుబడులు పెట్టారో తెలుస్తుంది.

పోంజీ తరహా మోసం..

రామోజీరావు పోంజీ (గొలుసుకట్టు) తరహా మోసాలకు పాల్పడుతున్నారు. మార్గదర్శి సంస్థ చిట్టీలలో 30 శాతం నుంచి 40 శాతం టికెట్లు (సభ్యత్వాలు) యజమాన్యం పేరిట ఉంచుతోంది. ఆ టికెట్లకు చెల్లించాల్సిన చందాలను చెల్లించడం లేదు. ఇతర చందాదారులు చెల్లించిన చందాలను తాము చెల్లించినట్లు రికార్డుల్లో చూపిస్తోంది. వాటిపై మళ్లీ 5 శాతం కమీషన్ తీసుకుంటోంది. చందాదారుల సొమ్మును వ్యక్తిగత ప్రయోజనాలకు వాడుకుంటోంది.

చందాదారుల హక్కులకు విఘాతం

రాష్ట్రంలో మార్గదర్శి చిట్‌ఫండ్స్ తమ బ్రాంచిల్లో చందాదారులు చెల్లించిన మొత్తాలను నిబంధనలకు విరుద్ధంగా పక్క రాష్ట్రానికి తరలించింది. మార్గదర్శి చిట్ ఫండ్స్ మేనేజర్లకు (ఫోర్‌మెన్) చట్టప్రకారం ఉండాల్సిన చెక్ పవర్‌తో సహా ఎలాంటి అధికారాలు లేవు. బ్యాంకు వ్యవహారాలు, చెక్ పవర్ అంతా హైదరాబాద్‌లోని మార్గదర్శి చిట్‌ఫండ్స్ ఎండీ శైలజతోపాటు ఆ సంస్థ ప్రధాన కార్యాలయంలోని 11 మందికే ఉంది. రాష్ట్రంలో చందాదారులు చెల్లించిన మొత్తానికి బాధ్యులెవరని ప్రశ్నిస్తే సమాధానమే లేదు.

ఏప్రిల్ 1 నుంచి దివ్యదర్శనం పునఃప్రారంభం

అలిపిరి, శ్రీవారి మెట్టు మార్గంలో రోజుకి 15,000 టోకెన్ల జారీ

తిరుమల: కరోనా కారణంగా మూడేళ్ల కిందట రద్దు చేసిన దివ్య దర్శనాన్ని ఏప్రిల్ 1 నుంచి ప్రయోగాత్మకంగా టీటీడీ పునరుద్ధరించనుంది. అలిపిరి, శ్రీవారి మెట్టు మార్గంలో నిత్యం 15,000 టోకెన్లను భక్తులకు జారీ చేయనుంది. 15,000 మంది కంటే ఎక్కువ మంది నడకమార్గంలో తిరుమలకు వస్తే, పరిస్థితిని సమీక్షించి ఏప్రిల్ 15న జరిగే పాలకమండలి సమావేశంలో టోకెన్ల పెంపుపై నిర్ణయం తీసుకోనుంది. కరోనా పరిస్థితుల అనంతరం శ్రీవారి దర్శనంపై ఉన్న ఆంక్షలన్నింటినీ తొలగించిన నేపథ్యంలో కాలినడకన వచ్చే వారికి దివ్యదర్శనం టోకెన్లను జారీ చేయాలని భక్తుల నుంచి టీటీడీకి విజ్ఞాపనలు వచ్చాయి. వాటిని పరిగణనలోకి తీసుకున్న టీటీడీ తిరిగి దివ్యదర్శనం టోకెన్లను జారీ చేయాలని నిర్ణయించింది. ఇప్పటికే నిత్యం 20,000 నుంచి 30,000 సర్వదర్శనం టోకెన్లను భక్తులకు టీటీడీ జారీ చేస్తుండటంతో సర్వదర్శనం టోకెన్ల కోటాను కొంత మేర తగ్గించి నిత్యం అలిపిరి కాలిబాట మార్గంలో 10,000, శ్రీవారి మెట్టు మార్గంలో 5,000 దివ్యదర్శనం టోకెన్లను జారీ చేసేందుకు ఏర్పాట్లు చేస్తోంది.

ప్రజాస్వామ్యం ఖూనీ

- ప్రతిపక్షపాత్ర పోషిస్తున్న బీజేపీ
- పార్లమెంట్‌ను స్తంభింపచేయడం దారుణం
- తెలంగాణ, కేరళలో గవర్నర్లు చట్టాలను తమ కుర్చీలో వేసుకుని కూర్చున్నారు
- సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు


భువనగిరిలో అమరవీరుల జ్యోతిని బీవీ రాఘవులుకు అందజేస్తున్న సీపీఎం నాయకులు, చిత్రంలో పార్టీ నాయకులు వీరయ్య, చెరుపల్లి సీతారాములు, జూలకంటి రంగారెడ్డి ఉన్నారు

సాక్షి,యాదాద్రి: పార్లమెంట్‌ను ప్రతిపక్ష పార్టీలు స్తంభింపజేస్తాయి కానీ, అధికారంలో ఉన్న బీజేపీ అదానీ కోసం పార్లమెంట్‌ను స్తంభింపజేస్తున్నదని సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు అన్నారు. అదానీ స్టాక్ కుంభకోణంపై జేపీసీ వేయాలని ప్రతిపక్షపార్టీలు డిమాండ్ చేస్తున్న నేపథ్యంలో అధికార పార్టీ బీజేపీ పార్లమెంట్‌లో ఆందోళన చేయడం ఏమిటని ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వం తీరు ప్రజాస్వామ్యానికి తీవ్ర నష్టం చేస్తుందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి పట్టణంలో మంగళవారం సీపీఎం జిల్లా కార్యాలయాన్ని రాఘవులు ప్రారంభించారు. ఆ తర్వాత జనచైతన్య యాత్ర బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ... రాహుల్ గాంధీ పార్లమెంట్ సభ్యత్వాన్ని రద్దు చేసి కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అప్రజాస్వామ్యంగా వ్యవహరిస్తోందన్నారు. దేశంలో విపక్షాలు ఏకమై బీజేపీని ఓడిస్తేనే ప్రజాస్వామ్యం బతుకుతుందని లేకుంటే ప్రమాదంలో పడుతుందన్నారు. రాహుల్‌గాంధీపై అనర్హత వేటు వేయడాన్ని సీపీఎం ఖండించడంలో ప్రజాస్వామ్యానికి జీవం పోయాలనే ఉద్దేశమే తప్ప కాంగ్రెస్ ప్రత్యేక ప్రేమ ఏమీలేదని స్పష్టం చేశారు. దేశ రక్షణ, ప్రజల హక్కులు, ప్రజాస్వామ్యం, సమాఖ్య స్ఫూర్తి, సామాజిక న్యాయం కోసం బీజేపీయేతర పార్టీలన్నీ కలిసి రావాలని రాఘవులు పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీకి అన్యాయం జరిగితే ప్రతిపక్షాలు ఐక్యం కావాలంటారని, ప్రతిపక్షాలకు అన్యాయం జరిగినప్పుడు మాత్రం కాంగ్రెస్‌కు ఐక్యత గుర్తుకురాదని చురకలంటించారు. తెలంగాణ, కేరళలో గవర్నర్‌లు రాష్ట్ర ప్రభుత్వ చట్టాలను తమ కుర్చీలో వేసుకుని కూర్చున్నారని ఆయన విమర్శించారు.

ముగ్గురిని బలిగొన్న రోడ్డు ప్రమాదం

- జేసీబీని తెస్తున్న ట్రాక్టర్‌ను ఢీకొన్న కారు.. భీమ్‌గల్ వద్ద ఘటన
- కారుపై పడ్డ జేసీబీ.. ముగ్గురు అక్కడికక్కడే మృతి
- మృతుల్లో భార్యాభర్తలు, సోదరి.. మరో నలుగురికి గాయాలు


108 వాహనంలో క్షతగాత్రుల తరలింపు

భీమ్‌గల్: నిజామాబాద్ జిల్లా భీమ్‌గల్ పట్టణ శివారులో మంగళవారం రాత్రి 8 గంటల సమయంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకే కుటుంబానికి ముగ్గురు అక్కడికక్కడే మృతి చెందారు. మరో నలుగురికి గాయాలయ్యాయి. మోర్తాడ్ మండలం దొన్కల్‌కు చెందిన వడ్ల రాజేశ్వర్, ఆయన చెల్లెలు గోవింద్ పేట్‌కు చెందిన రమ కుటుంబ సభ్యులు ఏడుగురు భీమ్‌గల్ మండలంలోని బడా భీమ్గల్ ఎల్లమ్మ ఆలయానికి దైవ దర్శనం కోసం వచ్చారు. తిరుగు ప్రయాణంలో కారులో వెళ్తుండగా భీమ్‌గల్ సబ్‌స్టేషన్ వద్ద జేసీబీని ట్రాలీపై తెస్తున్న ట్రాక్టర్ బలంగా ఢీకొట్టింది. దీంతో ట్రాక్టర్ ఇంజిన్‌తో పాటు ట్రాలీపై ఉన్న జేసీబీ కారుపై పడింది. కారులో ఉన్న వడ్ల రాజేశ్వర్, ఆయన భార్య జ్యోతి, చెల్లి రమ అక్కడికక్కడే మృతి చెందారు. పోలీసులు గంట పాటు శ్రమించి మృతదేహాలను బయటకు తీశారు. మృతదేహాలతో పాటు క్షతగాత్రులను బయటకు తీసేందుకు మూడు జేసీబీలను తెప్పించారు. జేసీబీల సహాయంతో కారులో ఇరుక్కున్న ఇద్దరు చిన్నారులతో పాటు మరో ఇద్దరిని 108లో ఆర్మూర్ ఆస్పత్రికి తరలించారు. మృతురాలు రమ భర్త రాజేశ్వర్ పరిస్థితి విషమంగా ఉండడంతో నిజామాబాద్ ఆసుపత్రికి తరలించారు

జిల్లా వార్తలు

సీతారాములుకు 'మహానంది' పురస్కారం


సీతారాములు

ఖమ్మంగాంధీచౌక్: తెలుగు వెలుగు సాహితీ వేదిక ఆధ్వర్యాన ఖమ్మంకు చెందిన రచయిత, కవి, మైనార్టీ గురుకులాల ఉమ్మడి జిల్లా విజిలెన్స్ అధికారి కె. సీతారాములుకు మహానంది పురస్కారాన్ని ప్రకటించారు. ఈసందర్భంగా వేదిక చైర్మన్ పోలోజు రాజ్‌కుమార్ ప్రకటన విడుదల చేయగా, ఏప్రిల్ 2న హైదరాబాద్‌లో జరగనున్న సమావేశంలో ఆయన అవార్డు అందించనున్నట్లు తెలిపారు. ఈసందర్భంగా సీతారాములును ఉమ్మడి జిల్లాలోని కవులు, కళాకారులు, రచయితలు అభినందించారు.

మంగళగూడెం ఉపాధ్యాయుడు..

ఖమ్మంరూరల్: ఉగాది మహానంది పురస్కారానికి మండలంలోని మంగళగూడెం పాఠశాల ఉపాధ్యాయుడు ఐలయ్య ఎంపికయ్యాడు. ఈ విషయమై తెలుగు వెలుగు సాహి తీ వేదిక చైర్మన్ రాజ్‌కుమార్ నుంచి సమాచారం అందగా, ఆయనను ఎంపీపీ బెల్లం ఉమ, జెడ్పీటీసీ ఏ.వరప్రసాద్ అభినందించారు.

నిత్యాన్నదానానికి విరాళం


విరాళం అందజేసిన దాతలు, ఆలయ సిబ్బంది

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామ చంద్ర స్వామి దేవస్థానంలో జరిగే శాశ్వత నిత్యాన్నదాన కార్యక్రమానికి ఖమ్మంకు చెందిన భక్తులు విరాళం అందచేశారు. ఖమ్మం కమాన్‌బజార్‌కు చెందిన యరవళ సుదర్శనర్‌రావు, ఇందిరాదేవి రూ.1,00,001 నగదును మంగళవారం అధికారులకు అందజేయగా, వారు రశీదు ఇచ్చి దర్శనం చేయించారు. దాతల కుటుంబసభ్యులు, ఆలయ సిబ్బంది రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హైదరాబాద్‌కు నాన్‌స్టాప్ బస్సులు

ఖమ్మం మామిళ్లగూడెం: ఖమ్మం నుండి హైదరాబాద్ వెళ్లే వారి కోసం రాజధాని ఏసీ నాన్‌స్టాప్ సర్వీసులు ఏర్పాటుచేసినట్లు ఆర్టీసీ డిపో మేనేజర్ బి.శ్రీనివాస్ తెలిపారు. ఖమ్మం కొత్త బస్టాండ్ నుండి మహాత్మాగాంధీ బస్‌స్టేషన్‌కు ఉదయం 5గంటలకు, మియాపూర్‌కు 7గంటలతో పాటు 10–30, 12గంటలకు, సాయంత్రం ఆరు గంటలకు ఈ బస్సులు మొదలవుతాయని పేర్కొన్నారు. ఇవేకాక హైదరాబాద్‌కు ప్రతీ అరగంటకు రాజధాని, సూపర్ లగ్జరీ బస్సులు అందుబాటులో ఉంటాయని డిపో మేనేజర్ వివరించారు.

ఇటు టీఎస్.. అటు ఏపీఎస్

- రామయ్య చెంతకు ఆర్టీసీ బస్సులు
- 'నవమి'కి 300 ప్రత్యేక బస్సుల ఏర్పాటు
- సాధారణ చార్జీలతోనే మూడు రోజుల పాటు ప్రత్యేక సర్వీసులు



ఆర్టీసీ బస్సులు

చుంచుపల్లి: శ్రీరామనవమిని పురస్కరించుకుని భద్రాచలంలో గురువారం జరిగే శ్రీసీతారాముల కల్యాణోత్సవం, శుక్రవారం నాటి పట్టాభిషేకాన్ని తిలకించేందుకు లక్షల సంఖ్యలో భక్తులు రానున్నారు. రెండు తెలుగు రాష్ట్రాల నుంచి భక్తులు హాజరుకానున్న నేపథ్యాన సరిపడా రైళ్లు లేకపోవడంతో ఎక్కువగా బస్సులనే ఆశ్రయించే అవకాశముంది. ఈ నేపథ్యాన ఇబ్బందులు ఎదురుకాకుండా టీఎస్ ఆర్టీసీతో పాటు ఏపీఎస్ ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడపాలని నిర్ణయించింది. బుధవారం నుంచి మూడు రోజులపాటు ప్రత్యేక సర్వీసులు నడిపిస్తామని అధికారులు చెబుతున్నారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులను భద్రాచలానికి తరలించేందుకు ఈసారి 420 ప్రత్యేక బస్సులను అందుబాటులో ఉంచేలా కార్యాచరణ రూపొందించారు. హైదరాబాద్‌తో పాటు ఖమ్మం, వరంగల్, గోదావరిఖని, కరీంనగర్, నల్లగొండ, ఏపీలోని విజయవాడ, విశాఖపట్నం, ఏలూరు, రాజమండ్రి, జంగారెడ్డిగూడెం, కాకినాడ, తిరుపతి మాత్రమే ఇక మరికొన్ని ప్రాంతాల నుంచి కూడా ప్రత్యేక సర్వీసులు నడిపిస్తారు. కాగా, భక్తులకు ఇబ్బంది లేకుండా సాధారణ చార్జీలే అమలులో ఉంటాయని తెలిపారు. ఇందుకోసం 400 మంది ఆర్టీసీ సిబ్బందిని నియమించగా.. ప్రతీ బస్టాండ్‌లో భక్తులకు సమాచారం ఇచ్చేందుకు హెల్ప్ డెస్క్‌లు ఏర్పాటుచేయడమే కాక టెంట్లు, చల్లని తాగునీరు సమకూర్చనున్నారు. అలాగే, వేసవి నేపథ్యాన ప్రతీ బస్టాండ్‌లో వైద్య సిబ్బందిని నియమిస్తున్నట్లు తెలిపారు.


ఉభయ రాష్ట్రాల నుంచి ప్రత్యేక బస్సులు

భద్రాచలంలో గురువారం జరిగే శ్రీ సీతారాముల కల్యాణోత్సవానికి మహోత్సవానికి వచ్చే భక్తుల కోసం ఉభయ రాష్ట్రాల నుంచి 420 ప్రత్యేక బస్సులు నడిపించనున్నారు. ఈ బస్సులు ఎక్కువగా ఖమ్మం రీజియన్ నుంచి కేటాయించారు. ఖమ్మం రీజియన్ పరిధిలోని ఆరు డిపోల పరిధిలో 245 బస్సులు ఉండగా,.. భద్రాచలం డిపో నుంచి అత్యధికంగా 60 బస్సులు, ఖమ్మం, కొత్తగూడెం, మణుగూరు, సత్తుపల్లి డిపోల నుంచి 40 చొప్పున, మధిర డిపో నుంచి 25 బస్సులను నడిపిస్తారు. ఇంకా కరీంనగర్, వరంగల్ నుంచి 20 చొప్పున, నల్లగొండ జిల్లా నుంచి 15 బస్సులను శ్రీరామనవమికి భద్రాచలం నడిపించనున్నారు. ఇవే కాకుండా పక్క రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్ నుంచి వచ్చే భక్తుల సౌకర్యార్థం ఏపీఎస్ ఆర్టీసీ అధికారులు సైతం పలు ప్రాంతాల నుంచి అధికారులు 120 బస్సులను ఏర్పాటుచేస్తోంది. కరోనా ప్రభావం పూర్తిగా తగ్గిపోయినందున ఈ ఏడాది సీతారాముల కల్యాణోత్సవానికి భక్తులు భారీగా హాజరయ్యే అవకాశముందన అంచనాతో ఆర్టీసీ అధికారులు ప్రత్యేక సర్వీసులు నడిపిస్తున్నారు.

శ్రీరామనవమికి ఏర్పాటుచేసిన ప్రత్యేక సర్వీసులు

టీఎస్ ఆర్టీసీ		ఏపీఎస్ ఆర్టీసీ	
డిపో	బస్సులు	డిపో	బస్సులు
భద్రాచలం	60	రాజమండ్రి	20
ఖమ్మం	40	తిరువూరు	10
కొత్తగూడెం	40	కాకినాడ	10
మణుగూరు	40	ఏలూరు	10
సత్తుపల్లి	40	వైజాగ్	10
మధిర	25	విజయవాడ	30
కరీంనగర్	20	జంగారెడ్డిగూడెం	10
వరంగల్	20	గోకవరం	10
నల్లగొండ	15	విశాఖపట్నం	10

భక్తులకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు



శ్రీ సీతారాముల కల్యాణానికి వచ్చే భక్తుల కోసం అన్ని రూట్ల నుంచి ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేశారు. ఆర్టీసీ పరంగా భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటాం. బస్టాండ్లలో నీడ కోసం టెంట్లతో పాటు తాగునీటి వసతిని కల్పిస్తున్నాం. ప్రత్యేక వైద్య బృందాలను అందుబాటులో ఉంచుతున్నాం. మూడు రోజుల పాటు ఈ ప్రత్యేక బస్సుల రాకపోకలు కొనసాగుతాయి.

– వంగరు.రామారావు, భద్రాచలం డిపో మేనేజర్

10 జీపీఏ సాధించేలా తీర్చిదిద్దండి


సమావేశంలో మాట్లాడుతున్న డీడీ రమాదేవి

భద్రాచలం: భద్రాచలం ఐటీడీఏ పరిధిలోని గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు పదో తరగతి వార్షిక పరీక్షల్లో 10 జీపీఏ సాధించేలా తీర్చిదిద్దాలని ట్రైబల్ వెల్ఫేర్ డీడీ రమాదేవి సూచించారు. ఐటీడీఏ కార్యాలయంలో మంగళవారం ఆమె గిరిజన సంక్షేమ శాఖ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, వార్డెన్లు, డిప్యూటీ వార్డెన్లతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా డీడీ మాట్లాడుతూ విద్యార్థులు మంచి మార్కులు సాధించేలా తీర్చిదిద్దడమే కాక మెనూ ప్రకారం పౌష్టికాహారం అందజేయాలని, ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. అలాగే, మజ్జిగ ప్యాకెట్లు, ఓఆర్‌ఎస్ పాకెట్లు సిద్ధం చేసుకోవాలని, పరీక్ష కేంద్రాలు దూరంగా ఉంటే రవాణా సౌకర్యం ఏర్పాటుచేయాలని చెప్పారు. ఈ సమావేశంలో ఏసీఎంఓ రమణయ్య, ఏటీడీఓలు నర్సింగరావు, చంద్రమోహన్, రూపాదేవితో పాటు బాన్సింగ్ తదితరులు పాల్గొన్నారు.

మైనింగ్‌లో ఇల్లెందు వాసికి డాక్టరేట్


సాయివినయ్

ఇల్లెందు: ఇల్లెందు 13వ నంబర్ బస్తీకి చెందిన లింగపల్లి సాయివినయ్ మైనింగ్ విభాగంలో పీహెచ్‌డీ సాధించాడు. ఇల్లెందుకు చెందిన లింగంపల్లి వెంకటేశ్వర్లు –అరుణ కుమారుడైన సాయి వినయ్ ఇంటర్ వరకు స్థానికంగానే పూర్తిచేయగా, జేఎన్‌టీయూ మంథినిలో మైనింగ్ ఇంజనీరింగ్ పూర్తిచేశాడు. ఆతర్వాత జార్ఖండ్ రాష్ట్రం ధన్‌బాద్‌లోని మైనింగ్ యూనివర్సిటీలో పీహెచ్‌డీ కోసం చేరిన ఆయన డాక్టరేట్ అందుకున్నాడు.అంతేకాక మూడు ఇంటర్నేషనల్ జర్నల్‌కు సమీక్షకుడిగా వ్యవహరిస్తున్న వినయ్‌ను ఎమ్మెల్యే హరిప్రియ, గ్రంథాలయ చైర్మన్ దిండిగాల రాజేందర్, మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు తదితరులు మంగళవారం అభినందించారు.

సింగరేణి కళాశాల అధ్యాపకురాలికి..


డాక్టరేట్ అందుకుంటున్న సఫియాబేగం

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెంలోని సింగరేణి మహిళా డిగ్రీ, పీజీ కళాశాల అర్థశాస్త్రం అధ్యాపకురాలు సఫియా బేగంకు డాక్టరేట్ లభించింది. కొత్తగూడెం రాంనగర్‌కు చెందిన ఎం.డీ.షకీర్ ఉల్లా బేగ్ సతీమణి సఫియా బేగం.. ప్రొఫెసర్ ఏ.కే.వాసుదేవాచారి పర్యవేక్షణలో సమర్పించిన 'కంపారిటివ్ అనాలసిస్ ఆఫ్ ప్రొడక్టివిటీ ఇన్ అండర్ గ్రౌండ్ అండ్ ఓపెన్‌కాస్ట్ కోల్ మైన్స్ ఇన్ సింగరేణి కాలరీస్' అంశంపై సమర్పించిన పరిశోధనాత్మక గ్రంథానికి గాను ఓయూ నుంచి డాక్టరేట్ ప్రకటించారు. ఈసందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ సీహెచ్.శారద, అధ్యాపకులను ఆమెను అభినందించారు.

మహిళల ఆరోగ్య పరిరక్షణకు ప్రభుత్వం కృషి

డీఎంహెచ్‌ఓ హరీశ్‌రాజ్


వైద్యులతో మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ హరీశ్‌రాజ్

తొర్రూరు: మహిళల ఆరోగ్య పరిరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని మహబూబాబాద్ జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి హరీశ్ రాజ్ తెలిపారు. తొర్రూరులోని ప్రభుత్వ ఆస్పత్రిలో ఆరోగ్య మహిళ కార్యక్రమం అమలు తీరును మంగళవారం ఆయన పరిశీలించి మాట్లాడారు. మహిళలకు పరీక్షలు నిర్వహించి, మెరుగైన చికిత్స కోసం పెద్ద ఆస్పత్రులకు రెఫర్ చేయాలని వైద్యులకు సూచించారు. అలాగే, ప్రత్యేక అవసరాలు కలిగిన వారికి మందులు, మెరుగైన వైద్యం అందించాలని తెలిపారు. ఈకార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మంగళపల్లి రామచంద్రయ్య, కౌన్సిలర్లు ధరావత్ సునీత జైసింగ్, గుగులోతు శంకర్, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ మురళీధర్, వైద్యులు మీరాజ్, సిబ్బంది పాల్గొన్నారు.

బీదర్ టు భవానీగడ్డ తండా

15 క్వింటాళ్ల నల్లబెల్లం స్వాధీనం


స్వాధీనం చేసుకున్న నల్లబెల్లం, వాహనంతో ఎక్సైజ్ అధికారులు

కేసముద్రం: కర్ణాటక రాష్ట్రంలోని బీదర్ నుంచి కేసముద్రం మండలం భవానీగడ్డ తండా జీపీకి అక్రమంగా తరలించిన 15 క్వింటాళ్ల నల్లబెల్లాన్ని గూడూరు ఎక్సైజ్ శాఖ అధికారులు మంగళవారం స్వాధీనం చేసుకున్నారు. గూడూరు ఎక్సైజ్ సీఐ భిక్షపతి తెలిపిన వివరాల ప్రకారం.. భవానిగడ్డ తండా జీపీకి చెందిన భుక్యా సురేష్, ఇంటికన్నెకు చెందిన కొర్ర భద్రమ్మ, నల్లగొండ జిల్లాకు చెందిన పీట్ల రాజు(డ్రైవర్) కలిసి అశోక్ లేలాండ్ వాహనంలో బీదర్ నుంచి 30బస్తాల్లో నల్లబెల్లం, మూడు బస్తాల్లో పటికను తీసుకొచ్చారు. అదే సమయాన తండాలో గుడుంబా స్థావరాలపై దాడులు నిర్వహిస్తున్న ఎక్సైజ్ శాఖ అధికారులు.. వాహనంతో పాటు 15 క్వింటాళ్ల నల్లబెల్లం, మూడు బస్తాల పటిక, 30లీటర్ల సారాయిని స్వాధీనం చేసుకుని ముగ్గురిపై కేసు నమోదు చేశారు. తొలుత తండాలో 400 లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేశారు. తనిఖీల్లో ఎక్సైజ్ ఎస్సై జయశ్రీ, సిబ్బంది బుచ్చయ్య, సుధాకర్, వెంకన్న, నరేష్ పాల్గొన్నారు.